
# ఉగాది ఊరుమ్మడి కవిమేళా

ధనికొండ రవిప్రసాద్

ఉగాది రాగానే హృదయంలో రవ్వంత సున్నితత్వం వున్న ప్రతివారూ లేక ఏదో నాటికి కవి అనే రెండక్షరాలతో పిలవబడాలనుకునే ప్రతి ఒక్కరూ నాలుగు ముక్కలు కవిత్వం వ్రాసి తమ ఊరిలోని కవి సమ్మేళనంలో చదవటం మామూలే. నేను హాజరయిన అలాంటి ఊరుమ్మడి కవితా సమ్మేళనాల నుంచి 'మచ్చుతునకలు' మీతో పంచుకుంటే తప్ప పండగ గంధం రాదనిపించింది. ఈ రాస్తున్నది ఆక్షేపణగా కాదు. కేవలం సరదాగా గ్రహించ ప్రార్థన.




"వచ్చావా బావా!
నా హృదయంలో వసంతాన్ని నింపుతూ
వొచ్చావా బావా!"

అంటూ ఎత్తుకుంది ఒక కవయిత్రి. నిజంగా ఎంత కమ్మని ప్రేమగీతంలా వుంది ఆ కవిత్వం! ఆ సంవత్సరం పేరు భావ అనీ, ఆమెకి అక్షరాలు పలకక అలా చెప్పిందనీ మనక్కూడా అర్థంకాకపోతే ఆ కవిత మన హృదయంలో ఎంతటి మధుర భావాలు నింపుతుందో!

*

వేదికపై తన కవిత్వం చదివేసి కిందికి వచ్చి అందరి ముఖాల్లోకీ చూసిన కవిగారు చెవిలో వువ్వు పెట్టుకున్న ఒక గోముఖ శాస్త్రిగార్ని పలకరించాడు.

"ఏమండీ! మిమ్మల్ని ఎప్పుడో, ఎక్కడో చూసినట్టుందే" అని.

ఆ పుష్పకర్ణులవారు ఆప్యాయంగా నవ్వి ఒకేమాట అన్నారు.

"అది సరే! మీ కవిత్వం చూస్తే నాకు కూడా 'ఎప్పుడో, ఎక్కడో, ఎవరో గావం చేసేశారా?' అనే అనుభూతి కలిగింది. హిహ్హిహీ..."

(చెవిలో వువ్వు పెట్టుకున్న వాళ్ళంతా అమాయకులు కారు సుమండీ. కొంత మంది ఆ వువ్వు ఎదటివాళ్ళ చెవిలో పెడతారు.)

*

"వచ్చావా ఉగాదీ! వస్తూ తెచ్చావా వేప వువ్వు పచ్చడి"

అంటూ వచన కవిత అందుకున్నాడొక వర్ధమానకవి.

ఆహూతులకి వేపకాయ నములుతున్న అనుభూతి కలగసాగింది. వెంటనే ఛందస్సు తెలిసిన ఒక కుర్రవాడు లేచి

"వచ్చెనహో ఉగాది కొనివచ్చెను కమ్మని : వేపపూతలన్"

అన్నాడు. జనం చప్పట్లు కొట్టారు.

ఈ ఇద్దరిలో ఎవరి భావమూ గొప్పది కాదు. కానీ ప్రాచీనుల వరప్రసాదమైన ఛందస్సు అందంలేని దానికి అందాన్నిచ్చింది. "ఛందస్సుల సర్వ పరిష్వంగం" అంటూ ఫ్యాషన్లు వెళ్ళబోసే వాళ్ళందరూ శ్రీశ్రీలు కారు. చాలామంది ఛందస్సులో రాయటం చేతకాక, రవ్వంత శ్రమ చెయ్యలేక ఆ అందాన్ని దూరం చేస్తున్నారు.

*

అన్ని మతాలవారూ కలసి కవి సమ్మేళనం చెయ్యటం చక్కని సంప్రదాయం. ఇలాంటి సమావేశాల్లో ముస్లింలు చాలా మర్యాదస్తులు. కొన్నిసార్లు కవిత్వం అందంగా లేకపోయినా, భావం అర్థంకాకపోయినా అసంతృప్తి కనిపించనివ్వకుండా "వహవ్వా! సెబాష్! క్యాబోలే! ఫిర్ ఏక్‌బార్!" అంటూ అభినందిస్తారు.

ఒక తెలుగు కవిగారు ముషాయిరాలో పాల్గొని

"ఈ ప్రపంచ మనల్పం
నా జ్ఞానం బహు స్వల్పం" అన్నాడు.

"సెబాష్! వహ్వా! ఫిర్ ఏక్ బార్!" అంటూ ప్రోత్సహించారు ముస్లిం సోదరులు. వెంటనే కవిగారు చిన్నబుచ్చుకున్నారు

'ఇదేమిట్రా బాబూ! నా జ్ఞానం బహు స్వల్పం అంటే ఆ మాట ఇంకోసారి చెప్పమంటారే' అని. సరే! మర్యాదకోసం ఇంకోసారి చెప్పాడు. "ఈ ప్రపంచ మనల్పం-నా జ్ఞానం బహు స్వల్పం"

"వహ్వా! ఆప్‌నే సచ్ బోలా సాబ్. ఔర్ ఏక్ బార్ బోల్‌నా (మీరు నిజం చెప్పారు ఇంకోసారి చెప్పండి)" అంటూ మళ్ళీ అరిచాడొకాయన. కవిగారు మాత్రం మొహం చిట్లించుకుని చతికిలబడి కూర్చున్నాడు-ఈ జనం తనని వెక్కిరిస్తున్నారేమో అనుకుని.


*

కొందరు అచ్చతెనుగు ప్రియులు "స్థానిక కవి సమ్మేళనము" అనే పదాన్ని అచ్చ తెనుగులోకి మార్చే ప్రయత్నం చేశారు. ఒక పండితుడు అతి కష్టం మీద "ఊరి కవి కలయిక" అనే పదం తయారుచేసి చేతులు దులుపుకోగలిగాడు.

"హోత్తెరీ! ఊరకవి అనగానే ఏ ఊరపిచ్చికలో జ్ఞాపకమొచ్చే ప్రమాదం వుంది" అంటూ కవీశ్వరులంతా ఆక్షేపించారు.

"మీకు నానా రకాల అర్థాలు స్ఫురిస్తే నేను బాధ్యుణ్ణా! దీన్ని మించిన అనువాదం ఎక్కడా లేదంటాడు పండితుడు.

చివరికి "స్థానిక కవి సమ్మేళనం" అంటూ మామూలు పదం ఉపయోగిస్తేనేకానీ కవి సమ్మేళనానికి రామంటూ ఊరకవి సమూహం బెదిరించి సాధించింది.




# NORTH INDIA TOURS

| | Frequency | Fare |
|---|---|---|
| 1. Delhi-Badrinath-Kedarnath-Delhi | Every Monday/Friday | *1,200/- |
| 2. Delhi-Badrinath-Kedarnath-Gangotri-Yamunotri-Delhi | Every Friday | *2,200/- |
| 3. Delhi-Allahabad-Varanasi-Gaya-Ayodhya-Rishikesh-Delhi | Every Friday | 1,800/- |
| 4. Delhi-Simla-Kulu-Manali-Chandigarh-Delhi | Every Friday | 1,600/- |
| 5. Delhi-Agra-Jaipur-Delhi | Mon/Fri | 425/- |
| 6. Delhi-Mussoorie-Haridwar-Rishikesh-Delhi | Tues/Fri | 350/- |

***First service from 5.5.95. Fare includes Dormitory accommodation, Transport&Guide services.Veg. South Indian Meals will be served on tour at extra payment. We are running LTC tours for Central Govt. employees through ITDC. All Tours are by Super Deluxe Buses, Starting from our New Delhi Office. Contact our offices at Madras Ph: 564864, Hyderabad Ph : 227233, Bangalore Ph: 2262633 and Visakhapatnam Ph : 545565 for advance reservations.**

మీరు ఢిల్లీ వచ్చినప్పుడు ఆధునాతన సౌకర్యములతో నిర్మింపబడిన "హోటల్ సదరన్"లో బస చేయండి. ఢిల్లీలో రుచికరమైన తెలుగుభోజనం మా హోటలులోని అమరావతి/సుప్రభాత్" రెస్టారెంట్లలో లభించును.

## SOUTHERN TRAVELS / HOTEL SOUTHERN

Recognised by Dept. of Tourism, Government of India, New Delhi

ఢిల్లీలోని తెలుగు వారి ప్రముఖ వాణిజ్య సంస్థ

| | |
|---|---|
| 18/2, Arya Samaj Road,<br>W.E.A. Karol Bagh,<br>New Delhi - 110 005<br>Ph. 5739508, 5722210, 5724085 | No.10,Swarnalok Complex,<br>Near Apsara Theatre, Eluru Road,<br>Governorpet,Vijayawada - 520 002<br>Ph. 62227 |


# నవ వసంత వైభవము

ఆసక్తిన్ గలిగింప వచ్చె మధుమాసం బొప్పగన్ శోభతో
కైసేసెన్, విరహమ్మునన్ మధు శిలాకల్ తన్పునన్ క్రొవ్వుమన్
వాసిన్ వన్నె, గడించె – సంకుచిత భావాతీత వర్ణమ్ములై
భాసిల్లెన్ 'యువవర్ష' మందున సుహృద్భావమ్ము లింపారగన్

మకరంద స్వాదాన – మధుకర నాదమ్ము
మంగళధ్వానమ్ము – మండితమ్ము
కుహుకుహూయని కూయు – కోయిల స్వర్శతో
మామిడి చివురుల – మాధవమ్ము
తలపంత పలవించి – తనువంత పులకించు
శుకపిక గణముల – సోయగమ్ము
పండితులు వచించు – పంచాంగ శ్రవణాన
కులమతమ్ముల కుళ్ళు కంఠితమ్ము

గుండు మల్లియల్ వికసించి – గుస్తరించె
మోద సంభరిత సుమాల – ముకుళితమ్ము
చెలగి క్రొంగ్రొత్త రుచులతో – మొలకలెత్తు
నవవసంత వెలుగు శోభ – నయము కూర్చె

క్రొత్త పూతల వేప కొమ్మలు ఛల్లంగ
నవరించె నూత్న వింజామరములు
నవరిల్లె సౌరభ సంవాసితమ్ములై
పులకించె నీవని – పొల్పుమీర
ప్రియమార నేడు ఝుంకృతులను పలుపంగ
తపియించె శ్రీ షట్పదాల సంతు
నరసాల పరువమ్ము – నవదరించగ సిగ్గు
వలపించి కురిపించ – జలదరించె
మదన భూపతి జయభేరి మారుమ్రోగె
నవనవాశోకమయ్యె క్రొన్ననలు పూయ
భావ్య మెరుగుచు నరుదెంచె భవ్యరీతి
సుజన జగతికి ప్రియముతో స్ఫూర్తి నీయ

– ఆచార్య శ్రీవత్స

# వసంత సందేశం!

మోడు మోడు
పులకరించి
చిరునవ్వుల నాలక బోసె!
పూవు పూవు అరవిరిసి
పూదేనియ చిందించె!
కొమ్మ కొమ్మ విరగబూసి
చివురులన్నీ ఆరబోసె!
వచ్చింది ఆమనని-
హెచ్చిన ఆనందంతో
గళం విప్పి ఎలకోయిల
కమ్మ కమ్మగా పాడె!
ఫల భారంతో వంగి
తొంగి చూసె మావికొమ్మ!
ఆశల దీపాలతోడ
ఎదలగదులు తేజరిల్లె!
మానవాళి కరము సాచి
నవవర్షము! రా! రమ్మని
స్వాగత గీతాలు పాడె!!

– డి.సి. కేశవరావు